కథావేదిక

సైన్స్ ఫిక్షన్

# సమాధిలో చైతన్యం

## – కె.ఆర్.కె.మోహన్

''అమెరికా 2010 సంవత్సరంలోగా అంగారక గ్రహం మీదికి వ్యోమగాములను పంపడానికి పథకాలు రచిస్తోందట. ఈరోజు పేపర్లలో వచ్చింది. చూశావా?'' అని అడిగాడు ప్రొఫెసర్ కిరణ్‌కుమార్.

''చూశాను. అసలు 1985లోనే అంగారకుని మీదకు ఇద్దరు అంతరిక్ష యాత్రికులను పంపాలని అమెరికాలోని నాసా కేంద్రం పథకాలను రూపొందించింది. కాని కుదరలేదు. తిరిగి ఈ శతాబ్దాంతం లోగానైనా యాత్ర జరిపించాలని ప్రయత్నాలు చేసింది. కాని ఫలించలేదు. మరో రెండు దశాబ్దాలకైనా విజయం సిద్ధిస్తుందా అనేది అనుమానమే'' అన్నాడు శ్యాం సుందర్. ఆయనా ప్రొఫెసరే.

''అదేమిటి శ్యాం. 1969లో ముగ్గురు వ్యోమగాములు చంద్రుని చేరగలిగారు కదా! వారిలో నీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రతలంపై తొలిసారి పాదం మోపాడు. అతని వెనకే ఆల్‌డ్రిన్ కూడా అడుగుపెట్టాడు. కాలిన్స్ అంతరిక్ష నౌకను కంట్రోల్ చేస్తూ పైనుంచి చంద్రప్రదక్షిణాలు చేశాడు. అటువంటి అమెరికాకి అంగారక గ్రహయాత్ర అసాధ్యం అంటావా?'' అన్నాడు కిరణ్.


''అసాధ్యం అననుకాని బహు కష్టసాధ్యం అంటాను. చంద్రమండల యాత్రకి మూడురోజులు మించి అవసరం లేదు. కనక అది సాధ్యం అయింది. అదే అంగారకుని చేరాలంటే కనీసం పదిపన్నెండు నెలలు పడుతుంది. వ్యోమగాములు కనీసం ఇద్దరైనా వుండాలి. వెళ్లిరావడానికి కనీసం ఏణ్ణార్ధం పడుతుంది. అంత కాలానికి వారిద్దరికీ సరిపడా ఆహార పదార్థాలు, సరుకులూ, సంబారాలూ ఎన్ని వుండాలి! అన్ని పట్టడానికి ఎంత పెద్ద అంతరిక్ష నౌక కావాలి? అంతటి నౌకను అంతరిక్షంలోకి నెట్టడానికి ఎంతటి శక్తి అవసరమవుతుంది! ఎంత పెద్ద రాకెట్‌ను నిర్మించవలసి వుంటుంది! ఇవన్నీ అంత సులువుగా దొరకని సమస్యలు. వీటికి ఆచరణాత్మకమైన పరిష్కారం లభించినప్పుడే గ్రహాంతర యానం సుసాధ్యమవుతుంది. అప్పటివరకు మనుషులు లేని వ్యోమనౌకలను పంపి యంత్రాలతోకాని రోబోట్‌లతోకాని పరిశోధనలు జరిపిస్తుండవలసిందే.''

''ఇప్పుడు సోజర్నర్, పాత్‌ఫైండర్ వంటివి అంగారకుని మీద పరిశోధనలు చేస్తున్నట్లున్నమాట.''

''కరెక్టు. రోబోట్‌లను పంపితే ఇంకా విస్తృతంగా పరిశోధనలు జరపవచ్చు. సోజర్నర్, పాత్‌ఫైండర్‌లు ఎంతటి విలువైన సమాచారాన్ని పంపుతున్నాయో తెలుసుగా! ఇవి ఆ గ్రహం మీద మానవుడు కాలూనగల ప్రదేశాలను గుర్తించి ఆ సమాచారాన్ని భూమికి పంపుతాయి. అందువల్ల ఆ సమాచారం ఆధారంగా చేపట్టే యాత్రలు సరక్షితంగా జరుగుతాయి.''

''అది సరే. ఇంతకుముందు కొలంబియా, డిస్కవరీ వంటి స్పేస్ షటిల్స్‌లోనూ, మీర్ వంటి అంతరిక్ష నౌకలోనూ, రోదసీ యానం చేసిన వ్యోమగాములు కొందరు అంతరిక్షంలో యోగాసనాలకు సంబంధించిన ప్రయోగాలు చేశారనీ, అవి ఆసక్తిదాయకమైన సత్ఫలితాలను ఇచ్చాయనీ, సైన్స్ జర్నల్స్‌లో చదివాను. వాటి ప్రయోజనం ఏమిటి?''

''మన హైద్రాబాద్‌కి చెందిన రాకేష్‌శర్మ రష్యన్ వ్యోమనౌకలో అంతరిక్ష యానం చేసినప్పుడు యోగాసనాలపై పరీక్షలు చేశాడు. అమెరికా, రష్యాలు అంతరిక్షంలో యోగాసనాలపై పరీక్షలను ఏ ఉద్దేశంతో చేశారో తెలీదుకాని యోగాసనాలు శరీర ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయని, మెరుగుపరుస్తాయని తెలిసినదే. అంతరిక్ష యాత్రికులకి, భారరహిత స్థితిలో ఆరోగ్యం దెబ్బతినే అవకాశం వుంటుంది. అటువంటి పరిస్థితిని యోగాసనాలు ఏవిధంగా చక్కబరచగలవో తెలుసుకోడానికి ఈ



పరీక్షలు జరిపి వుండవచ్చు. ఆ... అన్నట్టు కైరోలో న్యూఫైండింగ్స్ ఇన్ మాలిక్యులియర్ బయాలజీ అన్న అంశంపై ఇంటర్నేషనల్ సెమినార్ జరగబోతోంది కదూ! దీనిలో ప్రత్యేకించి యోగా రిసెర్చ్‌పై ఒక సెషన్ వుంది. ఈ సెషన్‌లో యోగా ఇన్ స్పేస్ ట్రావెల్ అని ఒక టాపిక్ వుంది. అ టాపిక్‌పై ప్రెజెంట్ చేసే పేపర్లలో కొత్త విషయాలు ఎన్నో బయట పడవచ్చు'' అన్నాడు శ్యాం సుందర్.

''మనం పనిచేస్తోంది సి.సి.యం.బి.లో కదా! మనకి ఈ సెమినార్ విశేషాలు చాలా ఆసక్తిని కల్పిస్తాయి.''

''మన సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ ఇటువంటి సెమినార్‌లకు తన ప్రొఫెసర్లనూ, సైంటిస్టులనూ పంపుతూ వుంటుంది. ఈసారి కూడా ఇన్విటేషన్ వచ్చి వుండవచ్చు. మరి వాళ్లు ఎవర్ని పంపిస్తారో!''


''మనల్ని పంపిస్తే ఎంత బాగుంటుంది!''

''నిజమే. మనిద్దరిలో కనీసం ఒకర్ని పంపినా చాలు.''

''కానీ.. ఇంకా మూడునెలల టైం వుందిగా! చూద్దాం.''

లంచ్ అవర్ అయిపోతుండడంతో మిత్రులిద్దరూ తమ తమ డిపార్ట్‌మెంట్‌లకు వెళ్లిపోయారు.

హైద్రాబాద్‌లోని సి.సి.యం.బి.లో డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ శ్యాం సుందర్‌లు సైంటిస్టులుగా ప్రవేశించారు. సీనియారిటీ ననుసరించి డాక్టర్ శ్యాం సుందర్ ప్రొఫెసర్‌గా ప్రమోట్ అయ్యాడు. కిరణ్ సీనియర్ సైంటిస్టుగా వుండి ప్రొఫెసర్ పోస్టు ఖాళీ వస్తే అందులో అడిషనల్ ఛార్జితో పనిచేస్తున్నాడు. ఇద్దరు పనిచేసేది జెనెటిక్ ఇంజనీరింగ్ శాఖలోనే. వారు నిత్యమూ జీన్స్, డి.ఎన్.ఎ బయోకరెంట్స్ వంటి జన్యుసంబంధమైన విషయాలలో పరిశోధనలు చేస్తుంటారు. అందుకే వారికి యోగ విషయాలపై ప్రత్యేక ఆసక్తి.



● ● ●

ఆరోజు సి.సి.యం.బి డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి శ్యాం సుందర్‌ని, కిరణ్‌ని తన ఛాంబర్‌కి పిలిచారు.

''మిస్టర్ శ్యాం, మిస్టర్ కిరణ్...స్వామీ రామానంద పేరు విన్నారుగా'' అని అడిగారు ఆయన.

''విన్నాను. హిమాలయాల్లో హరిద్వార్‌లోనో, హృషీకేశ్‌లోనో వుంటారని చదివాను. ఆయన గొప్ప యోగి అని విన్నాను'' అన్నాడు శ్యాం.

''ఆయన సమాధిలో రోజుల తరబడి వుంటారని, పరీక్షల నిమిత్తం శాస్త్రజ్ఞుల ముందు సమాధిలోకి వెళ్లారనీ నేనూ చదివాను'' అన్నాడు కిరణ్.

''కరెక్టు. అమెరికాలోని నాసా సంస్థ యోగ శక్తులపై ప్రత్యేక ఆసక్తి చూపిస్తోంది. స్వామీ రామానంద గురించి వారు విన్నారు. అందువల్ల వారి శాస్త్రజ్ఞుల సమక్షంలో డిమాన్‌స్ట్రేషన్ ఇమ్మనీ, సమాధి స్థితిలో వుండగా ఆయనపై పరీక్షలు జరపడానికి అనుమతించమనీ కోరారు. అందుకు ఆయన సమ్మతించారు. వచ్చేనెలలో ఢిల్లీలో డిమాన్‌స్ట్రేషన్ ఇయ్యబోతున్నారు. ఆ పరీక్షలు నాసా వారికే కాదు-మన సి.సి.యం.బి.కి కూడా చాలా ప్రయోజనకరంగా వుంటాయి. అందువల్ల దానికి మీ ఇద్దర్నీ డిప్యూట్ చేస్తున్నాను. వచ్చే నెలలో వెళ్లడానికి సిద్ధంగా వుండండి'' అన్నాడు డాక్టర్ కుమారస్వామి.

''థాంక్యూ సర్ థాంక్యూ... ఉయ్ ఆర్ గ్రేట్‌ఫుల్ టు యూ'' అన్నాడు శ్యాం సంతోషాతిరేకంతో.

''మి టూ సార్. మీరన్నట్లు ఈ పరీక్షలు మన సెంటర్‌కి చాలా హెల్ప్‌ఫుల్‌గా వుంటాయి'' అన్నాడు కిరణ్.

''మరో విషయం. మరో మూడునెలల్లో ఈజిప్టులోని కైరోలో ఇంటర్నేషనల్‌లో సెమినార్ జరగబోతోంది. మన ఇన్‌స్టిట్యూట్ నుంచి ఇద్దర్ని పంపమని ఆహ్వానం వచ్చింది. ఎవర్ని పంపేదీ ఇంకా డిసైడ్ చేయలేదు. ఆ ఇద్దరూ మీరే కావచ్చు. అదే జరిగితే ఢిల్లీలో మీరు చేసే అబ్జర్వేషన్‌లు మీకు ప్లస్ పాయింట్స్ అవుతాయి'' అన్నాడు డాక్టర్ కుమారస్వామి మళ్లీ.

''మీకు ఏం చెప్పాలో అర్థంకావడంలేదు సార్. యు ఆర్ అవర్ గాడ్‌ఫాదర్'' అన్నాడు శ్యాం ఆనందాతిరేకంతో.

''దట్సాల్‌రైట్. క్యారీ ఆన్. ఆల్ ది బెస్ట్'' అన్నారాయన.

● ● ●

ఢిల్లీలో స్వామీ రామానంద ఇచ్చే యోగ ప్రదర్శనకు రంగం సిద్ధమైంది. ఆయన ఆశ్రమంలో గాలీ,

## ఉమ్మడి భార్య

హిమాలయ పర్వత శ్రేణిలో 7,000 అడుగుల ఎత్తులో 'కొడునా' అన్న చిన్న గ్రామం వుంది. ఈ గ్రామవాసుల్లో వున్న సాంప్రదాయం కుటుంబంలో పెద్దవాడు పెళ్లాడితే అతనికి ఎంతమంది సోదరులుంటే అంతమందికి, పెళ్లాడిన ఈయనగారికి ఆ అమ్మాయి ఉమ్మడి భార్యగా చెలామణి అవుతుంది.

ఇదేం సాంప్రదాయం? అని ఈ గ్రామవాసుల్ని ఎవరైనా ప్రశ్నిస్తే- మేం పంచ పాండవుల సంతతికి చెందినవారం అంటూ సగర్వంగా చెబుతారు.


ఒక కుటుంబంలోని సోదరులందరికీ ఉమ్మడి భార్యగా చెలామణి అయ్యే ఈ కలియుగ ద్రౌపతి కడుపున జనించిన సంతానం... ఈ సోదరులలో ఎవరికీ ప్రత్యేకించి చెందదు. ఈ సంతానం కూడా ఉమ్మడి సంతానమే.

## లవ్ నవల

ఇండియాలోని మొదటి అక్షరం లండన్‌లోని మొదటి అక్షరం, ఒంగోల్‌లోని మొదటి అక్షరం, విజయవాడలోని మొదటి అక్షరం, ఇంగ్లాండ్‌లోని మొదటి అక్షరం, ఎల్లోలోని మొదటి అక్షరం, ఊటీలోని మొదటి అక్షరం, అంకుల్‌లోని మొదటి అక్షరం కలిపి చదువుకోండి అని వ్రాసింది ఇటీవల తన అభిమానికి ఐదక్షరాల రచయిత్రి. ఇలా ప్రేమను వ్యక్తం చెయ్యడానికి చాట్కాలు కోకొల్లలు.

ఫ్రాన్‌సెస్‌కో అనే ఇటలీ రచయిత బోలియా అనే అమ్మాయిని ప్రేమించాడు. తన ప్రేమను ఆ అమ్మాయికి చెప్పడానికి ధైర్యం చాలక 25,000 పదాలతో 37 అధ్యాయాల నవల రాశాడు. 37 అధ్యాయాలలోని మొదటి అక్షరాలను కూర్చి చదివితే ఫ్రాన్‌సెస్‌కో బోలియాను ప్రేమిస్తున్నాడు అనే వాక్యం వస్తుంది. ప్రేమను ప్రకటించడానికి ఒక నవల అన్నమాట.

- శ్వేత




వెలుతురూ చక్కగా వచ్చే గదిలో రామానందకి తల్పం ఏర్పాటుచేశారు. నాసా నుంచి ఒక శాస్త్రజ్ఞుల బృందం వచ్చింది. సి.సి.ఎం.బి నుంచి డాక్టర్ శ్యాం సుందర్, డాక్టర్ కిరణ్‌లు, అలాగే మరికొన్ని ఇతర సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు వచ్చారు. అందరూ కలిసి సుమారు ఇరవైమంది వున్నారు.

స్వామీ రామానంద సూర్యోదయాన్నే, శుచిగా స్నానం చేసి పూజాదికాలు నిర్వహించి తనకు ఏర్పాటుచేసిన హాలులోకి వచ్చారు. అక్కడ సమావేశమై వున్న శాస్త్రజ్ఞుల బృందాన్ని, పత్రికా, ఆకాశవాణి, టీవీలకు చెందిన రిపోర్టర్‌లను ఉద్దేశించి ప్రసంగించారు.

''నేను మరో పది నిమిషాలలో అంటే సరిగ్గా ఏడు గంటలకు నాసా ఏర్పాటుచేసిన గదిలోకి ప్రవేశిస్తాను. అప్పుడూ మీరు పరీక్షలు జరపవచ్చు. నేను పూర్తిగా సమాధి స్థితిలోకి వెళ్లాక నేనుండగానే గదికి తాళాలు వేసి, సీలుచేసి తాళం చెవులు మీవద్దనే వుంచుకోండి. మీరు కావాలనుకున్నప్పుడు రోజూ గది తలుపులు తెరిచి నన్ను పరీక్షించవచ్చు. అటుతర్వాత మళ్లీ గదికి తాళాలు వేసి సీలు చేయండి. ఈరోజునుంచి సరిగ్గా ఏడవరోజున ఉదయం ఏడుగంటలకు తిరిగి చైతన్యంలోకి వస్తాను. నేను చైతన్యంలోకి వచ్చేముందునుంచి పూర్తిగా చైతన్యం పొందేవరకూ మీరు మళ్లీ పరీక్షలు జరుపవచ్చు. అంటూ ముగించారు.

శాస్త్రజ్ఞులు స్వామీజీకి ధన్యవాదాలు తెలిపారు. స్వామీ రామానంద తన గదిలోనికి వెళ్లి తల్పం మీద శవాసన భంగిమలో వెల్లకిలా పడుకుని కనులు మూసుకున్నారు.

కొందరు ఆ గదినంతా క్షుణ్ణంగా పరిశోధించారు. ఆ గదిలో స్వామీజీ పడుకున్న తల్పం తప్ప వేరేమీ లేదు.

శాస్త్రవేత్తలు ఆయన శ్వాసను, గుండె కొట్టుకోవడాన్ని రక్తపు పోటును పరీక్షించారు. అవన్నీ నార్మల్‌గా వున్నాయి. క్రమేపీ అవన్నీ మందగించసాగాయి. మరికొన్ని నిముషాలలోని శ్వాస, హృదయ స్పందన పూర్తిగా ఆగిపోయాయి. రక్తపోటు కూడా పూర్తిగా స్థంబించిపోయింది.

''ఇది మన మెడికల్ టెర్మినాలజీలో క్లినికల్ డెత్'' అన్నాడు నాసా కేంద్రానికి చెందిన డాక్టర్ రిచర్డ్.

''మామూలుగా వ్యక్తి చనిపోయిన కొద్దిగంటలలో రిగర్ మార్టిస్ వస్తుంది. మరి స్వామీజీ విషయంలో ఏమి జరుగుతుందో!'' అన్నాడు శ్యాం సుందర్.

''రిగర్ మార్టిస్ అంటే ఏమిటి సార్?'' అని అడిగాడు ఒక పత్రికా విలేఖరి.

''మనిషి మరణించిన కొద్దిగంటలకు దేహం నీలిరంగుకి మారుతుంది. చర్మం బిర్రెక్కిపోతుంది. దీనిని రిగర్ మార్టిస్ అంటారు'' అని వివరించాడు కిరణ్.

స్వామీజీ దేహానికి రిగర్ మార్టిస్ రావడం లేదని ధృవీకరించుకున్నాక నాసా శాస్త్రజ్ఞులు ఆ గదికి గట్టి తాళాలు వేసి, సీలుచేసి బయటకు వచ్చారు. తర్వాత ప్రతిరోజూ శాస్త్రజ్ఞులందరూ గది తలుపులు తీసి స్వామీజీ దేహాన్ని పరీక్షించారు. రిగర్ మార్టిస్ రాలేదు. నిద్రపోతున్నట్లుగా స్వామీ రామానంద అచేతనంగా పడుకుని వున్నారు. అయితే జీవ వ్యాపారాలైతే ఏవీ బొత్తిగా లేవు. ఏడవరోజున ఉదయం ఏడుగంటలు కావస్తుంటే శాస్త్రజ్ఞులందరిలో ఉత్కంఠ కట్టలు తెంచుకుంటుంది. విలేకరులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఏడుగంటలు అవుతుండగా స్వామీజీ గదిలో తలుపులు తెరిచారు. స్వామీ రామానందలో శ్వాసప్రక్రియ ప్రారంభమైంది. శాస్త్రజ్ఞులు పరీక్షించడం మొదలుపెట్టారు. గుండె కొట్టుకోవడం ప్రారంభమై నెమ్మదిగా వేగం పుంజుకోసాగింది. సరిగ్గా ఏడుగంటలు అయ్యేసరికి స్వామీజీకి శ్వాస, దేహ ఉష్ణం, రక్తపోటు అన్నీ మామూలు స్థాయిని జేరాయి. నిద్రనుంచి లేచినట్లు స్వామీజీ కళ్లు తెరిచి లేచికూర్చున్నారు. తర్వాత పద్మాసనం వేసుకుని కళ్లు మూసుకుని కొంచెంసేపు మౌనంగా ప్రార్థన చేశారు.

శాస్త్రజ్ఞుల ఆశ్చర్యానికి అవధులు లేవు. ఇతరుల ఆనందాశ్చర్యాలకు హద్దులు లేవు. స్వామీజీ అందర్నీ హాలులో సమావేశమవమన్నారు. కొద్దిసేపట్లోనే ఆయన కూడా వచ్చి తన ఆసనంపై ఆసీనులయ్యారు. ప్రొఫెసర్ రిచర్డ్ ''స్వామీజీ... ఏడురోజులపాటు సకల జీవ వ్యాపారాలూ స్థంభించి, మృతదేహంలా వుండి తిరిగి చైతన్యంలోకి రావడం ఎలా సాధ్యం?'' అని అడిగాడు. ఈనాటి సైన్స్‌కి సమాధానాలు దొరకని విషయాల నెన్నిటినో ప్రాచీన భారతీయులు కనుగొన్నారు. అలాగే మానవ దేహానికి వున్న అద్భుత శక్తులు గురించి కూడా తెలుసుకున్నారు. శరీరం మూడు సందర్భాలలో చైతన్యాన్ని కోల్పోతుంది. అవి నిద్ర, మృత్యువు, సమాధి స్థితి అనేవి. మొదటి రెండూ మీకు తెలుసు. మూడవది ఇప్పుడు ప్రత్యక్షంగా చూశారు. నిద్రలో శ్వాస తీయడం తప్పితే జ్ఞానేంద్రియలేవీ ఇంచుమించు పనిచేయవు. అయితే ఇది తాత్కాలికం. మృత్యువు సంభవించినప్పుడు జ్ఞానేంద్రియాలు పనిచేయడం, శ్వాస, హృదయ చలనం పూర్తిగా ఆగిపోతాయి. ఇంక సమాధి స్థితిలో యోగి తన ఇష్టానుసారం సకల జీవ వ్యాపారాలనూ నియంత్రించగలడు'' అని వివరించారు.

''స్వామీజీ...యోగి సమాధిలోకి వెళ్లాక చైతన్యం కోల్పోతాడు కదా! మరి తిరిగి చైతన్యంలోకి ఏవిధంగా రాగలుగుతున్నాడు?'' అని అడిగాడు కిరణ్.

''సమాధి స్థితి అన్నది సృష్టిలో వున్నదే. గొంగళి పురుగును చూడండి. ఆకులు బాగా మేసి గూడు కట్టుకుని దీర్ఘనిద్రలోకి వెళ్తుంది. అప్పుడు దాని జీవ వ్యాపారాలన్నీ ఆగిపోతాయి. అయినా నిర్ణీత సమయానికి గూడు పగలకొట్టుకుని సీతాకోక చిలుక రూపంలో బయటకు వస్తుంది. ఎన్నో అల్పజీవాలు, క్రిమికీటకాలు,

ముఖ్యంగా ధృవప్రాంతాలలో వుండేవి వాతావరణం అనుకూలించనప్పుడు ప్రధానంగా శీతాకాలంలో నిద్రాణ స్థితిలోకి వెళ్లిపోతాయి. దీనినే శాస్త్రీయ పరిభాషలో హైబెర్‌నేషన్ అంటారు. ఇదంతా ఎలా జరుగుతోంది! కోడి తొలిజామునే సరిగ్గా సమయానికి ఎలా కూస్తుంది! ఇవన్నీ నాచ్యురల్ ఇన్‌స్టింక్ట్ అని మీరన వచ్చు. కాని ఆ ఇన్‌స్టింక్ట్ ఏవిధంగా పనిచేస్తుంది?''

''క్షమించండి స్వామీజీ. నేను అడిగింది అచేతనంగా వున్న దేహాన్ని చైతన్య స్థితిలోకి తీసుకురావడానికి ఏ శక్తి ప్రేరేపిస్తుంది?'' అని అంటూ అడ్డు తగిలాడు కిరణ్.

''అదే చెప్తున్నా. మనలో చాలామంది ఏ అలారం అవసరం లేకుండా ఎంతటి నిద్రలోవున్నా కావాలనుకున్న సమయానికి మెలకువ తెచ్చుకోగలరు. వారికి బలీయమైన మనోసంకల్పమే అలారం అన్నమాట. అలాగే యోగులు అమిత బలీయమైన మనోశక్తితో అన్న సమయానికి జాగృతం కాగలరు. కంప్యూటర్‌లో ప్రిసెట్ ప్రోగ్రాంలాగా ముందుగానే వారి జాగృత శక్తి సెట్ అయి వుంటుంది. ఈ విషయాలన్నీ అర్థం కావాలంటే సరియైన గురువు దగ్గర శిక్షణ పొందాలి'' అని విశదపరిచారాయన. డిమాన్‌స్ట్రేషన్ పూర్తికావడంతో శాస్త్రవేత్తలందరూ తమ తమ ప్రదేశాలకు వెళ్లిపోయారు.

• • •

హైదరాబాద్‌కి తిరిగి వచ్చాక డాక్టర్ శ్యాం సుందర్, డాక్టర్ కిరణ్‌లు డాక్టర్ కుమారస్వామిని కలిసి ఢిల్లీ విశేషాలపై రిపోర్ట్ రాసిచ్చారు. స్వామిగారు ''వెరీగుడ్. మీకో గుడ్‌న్యూస్. మన సి.సి.ఎం.బి సెలక్షన్ కమిటీ కైరో సెమినార్‌కి మీ ఇద్దరినీ పంపడానికి సెలక్ట్ చేసింది. పోయి రండి. హావ్ ఎ హేపీ జర్నీ. ఆల్ ది బెస్ట్'' అన్నారు.

తమ చెవులను తాము నమ్మలేకపోయారు మిత్రులిద్దరూ. ''పేరుకి సెలక్షన్ కమిటీ కాని, సెలక్ట్ చేసింది మీరే సార్. మాపై మీకున్న అభిమానం అటువంటిది. మీ మేలును ఎప్పటికీ మరిచిపోలేం'' అన్నాడు శ్యాం.

చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు స్వామిగారు.

• • •

కైరోలో అంతర్జాతీయ సెమినార్ మూడురోజులు జరుగుతుంది. మొదటిరోజున నాసాకు చెందిన ప్రొఫెసర్ నిక్సన్ తన పేపర్‌లో ఆసక్తికరమైన అనేక విషయాలను వెల్లడించాడు. జపాన్‌లోని టోక్యో విశ్వవిద్యాలయంలోని బౌద్ధజెన్ యోగుల మీద కొన్ని పరిశోధనలను జరిపారట. అలాగే అమెరికాలోని కాలిఫోర్నియా యూనివర్శిటీలో కొందరు భారతీయ యోగుల మీద పరిశోధనలు చేశారట.

ఈ అందరు యోగుల దేహాంతర్గత స్థితికీ ఈజిప్టు పిరమిడ్స్‌లోని మమ్మీల దేహస్థితికీ పోలికలను కనుగొన్నారట. దీనినిబట్టి ఆ మమ్మీలు సమాధి స్థితిలోనున్న వ్యక్తుల దేహాలు కాదుకదా అన్న అనుమానం వారికి కలిగిందట.

మిషిగన్ యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ లారెన్స్ మరో విభ్రాంతికరమైన విషయాన్ని పేర్కొన్నాడు. వారి శాస్త్రజ్ఞుల బృందం ఈజిప్షియన్ మమ్మీల జీవ కణాలను పరిశోధించిందట. ఆ కణాలు ఏమాత్రం చెడిపోకుండా ఎప్పుడైనా తిరిగి జీవ చైతన్యం పొందే స్థితిలో వున్నాయట. దానినిబట్టి ఆ మమ్మీల మృతదేహాలా, లేక సమాధి స్థితిలోవున్న దేహాలా అన్న అనుమానం వచ్చిందట. ఈవిధమైన విభ్రాంతికర విషయాలను ఆ మిత్రులిద్దరూ ఆ రాత్రి చాలాసేపు చర్చించుకున్నారు.

''మనిషి సమాధి స్థితిలో సాధించగలిగితే ముందుగా టైం సెట్ చేసుకుని కావాలనుకున్నప్పుడు మెలకువ తెచ్చుకోవచ్చునని ధృవపడింది. అటువంటప్పుడు అంతరిక్ష యాత్రికులు సమాధి స్థితిలో ప్రయాణం చేస్తే వారు గమ్యం చేరుకుంటుండగా మెలకువ తెచ్చుకోవచ్చు. అప్పుడు ఆహారం, నీరు అధిక మొత్తంలో నిలవచేయడం వంటి సమస్యలు వుండవు. ఎంతటి సుదూర గ్రహాలకైనా ప్రయాణం చేయవచ్చు'' అన్నాడు శ్యాం.

''బ్రిలియంట్ ఐడియా. స్వామీ రామానంద వంటి వారు అర్హులైన అంతరిక్ష యాత్రికులకు తగిన శిక్షణ ఇవ్వగలరు. మనం ఈ సూచనని నాసా కేంద్రానికి పంపుదాం. ఆమధ్య నాసా కేంద్రం గ్రహాంతర యానానికి సులభమైన మార్గాన్ని సూచించినవారికి బహుమతి నిస్తామని ప్రకటించింది కూడా'' అన్నాడు కిరణ్.

''అవును. సరిగ్గా చెప్పావు. నాసా నుంచి వచ్చిన డాక్టర్ రిచర్డ్స్ వంటివారు ఢిల్లీలో స్వామీ రామానందపై జరిగిన పరిశోధనలను స్వయంగా గమనించారు. అందువల్ల నాసా కేంద్రం మన సూచనలు సీరియస్‌గా పరిశీలించవచ్చు'' అన్నాడు శ్యాం.

• • •

త్వరలోనే తమ ఆలోచనలను వివరంగా తెలుపుతూ డాక్టర్ శ్యాం సుందర్, డాక్టర్ కిరణ్‌కుమార్‌లు నాసా కేంద్రానికి తమ సూచనలను పంపారు. దాని సాధ్యాసాధ్యాలను బాగా పరిశీలించిన నాసా కేంద్రం ఆ సూచనను ఆమోదించింది. ఈ విషయంలో వారు స్వామీ రామానంద సహాయాన్ని కోరారు. అందుకు ఆయన అంగీకరించారు. అటు తర్వాత ఎంపిక చేసిన కొందరు అంతరిక్ష యాత్రికులకు స్వామీజీ సమగ్రమైన యోగశిక్షణను ఇచ్చారు.

ఏడాది గడిచిపోయింది. ఒక శుభ ముహూర్తాన ఇద్దరు శిక్షణ పొందిన యాత్రికులు కేప్ కెనడీలో అంతరిక్ష నౌకలో ప్రవేశించారు. నౌక భూవాతావరణాన్ని దాటుతున్న సమయంలో వారు సమాధి స్థితిలోకి వెళ్లిపోయారు. ఆ గ్రహాంతర నౌక అంగారక గ్రహం దిశగా దూసుకుపోయింది. ★



## వాయిదాలు

''ఏమిటి సార్? బిల్ వాయిదాల పద్ధతిలో ఇస్తున్నారు?'' అడిగాడు పేషెంటు పేరయ్య.

''ఏం లేదు. మీ గుండె బలహీనంగా వుందని మీ టెస్టుల్లో తేలింది. ఒకేసారి ఇస్తే అంతే సంగతులు'' బదులిచ్చాడు డాక్టర్ దైవ సహాయం.

-పి.వి. రమణకుమార్ (చిలకలూరిపేట).

## ఇస్తాను

''నా పర్సు పోయింది. ఎవరికయినా దొరికితే, నాకుయిస్తే యాభయి రూపాయలిస్తాను. అందులో అయిదువేలున్నాయి.'' అరిచాడు రామారావు.

''ఆ పర్సు దొరికితే నా కిచ్చేస్తే నేను అయిదు వందలు ఇస్తాను.'' మరింత గట్టిగా అరిచాడు రంగారావు.

## కాలేదు

''పరాయి ఆడదాన్ననేయినా ఆలోచించకుండా, కన్నార్పకుండా అలా చూస్తున్నారు. నన్ను చూస్తే మీకెవరయినా గుర్తొస్తున్నారా?'' అడిగింది బస్సు స్టాపులో తనపక్కనున్న కుర్రాడిని.

''అవునండీ. మా ఆవిడ గుర్తొస్తున్నది'' చెప్పాడా యువకుడు.

''ఆవిడ నాలాగా ఉంటారా?'' కుతూహలంగా మళ్లీ అడిగింది.

''ఏమో, తెలియదు. నాకింకా పెళ్లికాలేదు.'' చల్లగా చెప్పాడాయువకుడు.

- వి.వి.సీతారామదాసు (గుంటూరు)

